క్లుప్తంగా

ఉన్నత విద్యావకాశాలపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ప్రథమేష్ పాండే

అగనంపూడి: విదేశాల్లో ఉన్నత విద్యావకాశాలు, ఉపాధి అవకాశాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే అవకాశాలు, స్కాలర్‌షిప్‌లు, ఇతర సమాచారాన్ని వివరించారు. కార్యక్రమంలో యుఎస్‌ఏ గ్రాడ్యుయేట్ అడ్మిషన్స్ యూనివర్సిటీ ప్రతినిధి ప్రథమేష్ పాండే గ్రాండ్ వేలీ స్టేట్ యూనివర్సిటీ నుంచి భాగ్యశ్రీ వస్పనీ పాల్గొని అక్కడ గల అవకాశాలు వివరించారు. చదువుతోపాటు ఉపాధి అవకాశాలు, అడ్మిషన్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూధనరావు, కోఆర్డినేటర్ పి.సన్యాసిరావు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ మేళా నేడు

అగనంపూడి: హైదరాబాద్‌లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి శుక్రవారం ఉదయం 9గంటలకు లంకెలపాలెం సమీపంలోని హైటెక్ ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు హైటెక్ ఐటీఐ ప్రిన్సిపాల్ దుర్గునాయుడు తెలిపారు. ఈ మేళాలో వంద ఫిట్టర్, 40 పెయింటర్, 30 మిషనిస్ట్ ఖాళీలు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అప్రెంటిస్ సమయంలో నెలకు రూ.11వేలు, శిక్షణ పూర్తి అయిన తరువాత కొనసాగేవారికి నెలకు రూ.17వేలు వేతనంగా చెల్లిస్తారని తెలిపారు. శిక్షణ సమయంలో భోజనం, రవాణా చార్జీలు చెల్లిస్తారన్నారు. 18 నుంచి 24 సంవత్సరాల వయసు గల స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఐటీఐ అప్రెంటిస్ శిక్షణ ఒక సంవత్సరం ఉంటుందని, శిక్షణ పూర్తయిన తరువాత నేషనల్ అప్రెంటిస్ ట్రేడ్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం ద్వారా మంజూరు చేస్తారని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఐటీఐ ఉత్తీర్ణత పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

గాజువాక విద్యుత్ డీఈఈగా పార్థసారథి



అక్కిరెడ్డిపాలెం: గాజువాక విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఏ.పార్థసారథి గురువారం మింది విద్యుత్ సబ్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇతను ఆటోనగర్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వచ్చారు.

15 నెలల తరువాత ఇంటికి..


ఇంటికి చేరిన తల్లీ, కుమారుడు, కుమార్తె

అగనంపూడి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి కుమార్తె, కుమారుడితో పరారైన మహిళను దువ్వాడ పోలీసులు 15 నెలల తరువాత ఇంటికి చేర్చారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వడ్లపూడికి చెందిన మహిళ ఇంట్లో చిన్నపాటి ఘర్షణల కారణంగా గత ఏడాది మే నెలలో తన కుమారుడు, కుమార్తెను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు అప్పట్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు అప్పట్నించి దర్యాప్తు చేయగా, పిల్లలను పాఠశాలలో చేర్పించిన అడ్మిషన్ నంబర్ల ఆధారంగా వారు రాజమండ్రిలో ఉన్నట్టు గుర్తించారు. దీంతో వారిని గురువారం తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అదేవిధంగా ఇదే ప్రాంతానికి చెందిన మరో మహిళ మేలో తప్పిపోయింది. కేసు నమోదు చేసిన పోలీసులు అప్పట్నుంచి ఆమె ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు. కాల్‌డేటా ఆధారంగా ఆమె రాజమహేంద్రవరంలో ఉన్నట్టు గుర్తించి గురువారం ఇక్కడకు తీసుకొచ్చారు. దీంతో వారివారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తమైంది. కేసు ఛేదించడంలో హెడ్ కానిస్టేబుళ్లు సుశీల, సూరిబాబు, కానిస్టేబుళ్లు నవీన్, విజయ్‌చంద్రను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.


కొండపై వెలిసిన వేంకటేశ్వరస్వామి ఆలయం


సెక్టార్-5లోని మరిడిమాంబ దేవాలయం


సెక్టార్-8లోని షిర్డీసాయి ఆలయం

ఆధ్యాత్మిక పరిమళం ఉక్కునగరం


అయ్యప్ప దేవాలయం


టెంపుల్ స్ట్రీట్‌లో త్రిశక్తి దేవాలయం

ఉక్కునగరం: పవిత్రమైన కార్తీకమాసంలో ప్రజలు దేవాలయాలును సందర్శించి, పూజలు నిర్వహిస్తుంటారు. దీంతో ఈ నెల రోజులు దేవాలయాలు ప్రజలతో కిటకిటలాడుతుంటాయి. ఉక్కునగరంలోని ఆలయాలు భక్తుల సందర్శనతో రద్దీగా ఉంటాయి. ఉక్కునగరంలో అనేక ఆలయాలు ఉండటంతో పాటు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కార్తీక మాసం సందర్భంగా ఆయా ఆలయాలు ముస్తాబవుతున్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసే వివిధ రాష్ట్రాలు, వివిధ మతాలకు చెందిన ఉద్యో గుల విశ్వాసాలు, భక్తికి అనుగుణంగా ఆలయాలను నిర్మించారు. వాటన్నంటిని ఉద్యోగులు, ఆయా మతాలకు చెందిన పెద్దలు, సంస్థల విరాళాలతోనే నిర్మించారు. ఇందులో భాగంగా సెక్టర్-1 సమీపంలోని కొండపై వేంకటేశ్వరస్వామి కొలువై ఉండగా, సెక్టర్-5లో ఉమా సహిత రామలింగేశ్వరుడు ప్రతిష్ఠించబడ్డారు. రాష్ట్రంలోనే అతి పెద్ద నిర్మాణంతో కూడిన షిర్డీసాయి ఆలయం సెక్టర్-8లోను, పూరి జగన్నాథుని ఆలయం పోలిన జగన్నాథుని దేవాలయం సెక్టర్-9లోను సుందరంగా నిర్మించారు. ఉక్కునగరంలోని ఒక వీధిలో వరుసగా కాళీమాత, హనుమాన్, త్రిశక్తి, అయ్యప్ప ఆలయాలు ఉండటం విశేషం. ఇందులో శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి అమ్మవారులు ఒకే మంటపంలో కొలువైన అరుదైన ఆలయంగా త్రిశక్తి ఆలయంగా ఖ్యాతి గాంచగా, శబరిమలై అయ్యప్ప ఆలయం పోలిన అయ్యప్ప దేవాలయం మాలాధారణలు, అంబలం పూజలకు కేంద్రంగా మారింది. ఎక్కడా లేని విధంగా ఆలయాలు ఒకే రహదారిలో ఉండటంతో టెంపుల్ స్ట్రీట్ అని నామకరణం చేశారు. అదే విధంగా సత్యసాయి భక్తుల కోసం సెక్టర్-1లోని సత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రం, సెక్టర్-12లో దుర్గాదేవి తొమ్మిది అవతారాలతో కూడిన నవదుర్గా ఆలయం, సెక్టర్-5లో మరిడిమాంబ ఆలయాలు నిత్యం పూజలందుకుంటూ ఆధ్యాత్మిక పరిమళాన్ని విరాజిల్లుతున్నాయి.


సెక్టార్-9లోని పూరి జగన్నాథుని దేవాలయం


సెక్టార్-2లోని సత్యసాయి దేవాలయం


సెక్టార్ -5 లోని శివాలయం

కుటుంబ కథా చిత్రం 'ఎంత పని చేశావురా చంటి'


మాట్లాడుతున్న దర్శకుడు ఉదయ్ కుమార్

పెదగంట్యాడ: కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం 'ఎంత పని చేశావురా చంటి' అని చిత్ర దర్శకుడు ఉదయ్ కుమార్ అన్నారు. పీజీకే మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై బ్లడ్ డే బ్రదర్స్ నిర్మాణంలో రూపుదిద్దుకున్న 'ఎంత పని చేశావురా చంటి' ఈ నెల 25న విడుదల చేయనున్నామని చెప్పారు. ఈ మేరకు స్థానిక బీసీ రోడ్డులోని సాయిబాబా ఆలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని రూపొందించామని తెలిపారు. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య వచ్చే చిన్న చిన్న మనస్పర్థలు, అనుమానాలు, అపార్థాల కారణంగా చోటు చేసుకునే పరిణామాలను ఈ చిత్రంలో చూపించామన్నారు. గతంలో తాను దర్శకత్వం వహించిన 'తస్మాత్ జాగ్రత్త' చిత్రం ప్రేక్షాదరణ పొందిందని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఈ చిత్రాన్ని విశాఖలోని రామానాయుడు స్టూడియోలో ఈచిత్రం షూటింగ్ జరిపామన్నారు. శ్రీనివాస్ ఉలిశెట్టి కథనాయకుడిగా, నిహారిక కేశవ్, ప్రగ్యా గౌతమ్, శాంతి ప్రియ హీరోయిన్లుగా నటించారన్నారు. కో డైరెక్టర్‌గా బత్తిన సూర్యనారాయణ వ్యవహరించారని చెప్పారు. ఈ సమావేశంలో హీరో హీరోయిన్లతో పాటు అమ్మరాజు, నూకరాజు, ఎంటీ రాజు, దామోదర్, జగదీష్, వర్మ, సంతోష్, మధుబాబు పాల్గొన్నారు.

డిప్లమా పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు గడువు పొడిగింపు

అక్కిరెడ్డిపాలెం: ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ డిప్లమా పారామెడికల్ కోర్సుల కన్వీనర్ కోటా దరఖాస్తుల గడువు నవంబర్ 3వ తేదీ వరకు పొడిగించారని షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పటల్ లోని బొల్లినేడి మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. మేనేజ్‌మెంట్ సీట్ల కోటాకు నవంబర్ 12వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించామన్నారు. ఈ కోర్సుకు ఇంటర్‌లో ఏ గ్రూపు పాసైన విద్యార్థులు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అసక్తిగల విద్యార్థులు తమ ధ్రుపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7995013421, 7995013422 నంబర్లకు లేదా బొల్లినేని మెడ్ స్కిల్స్ పారామెడికల్ ఇన్‌స్టిట్యూషన్స్, కిమ్స్ ఐకాన్ హాస్పటల్ క్యాంపస్, షీలానగర్, విశాఖ నందు సంప్రదించాలన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


మేళాకు హాజరైన అభ్యర్థులు


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపాల్ కెఎస్ శ్రీనివాసరావు

పెదగంట్యాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాకు మొత్తం 207మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 75 మంది 5 కంపెనీలకు ఎంపికయ్యారు. మొత్తం 5 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ మేళాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యూ ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తరచుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని..యువత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఇటువంటి మేళాలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ప్రతినిధి శ్రీనాథ్ బరద్వాజ్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వేద వైశ్య, మోల్బియో డయాగ్నోస్టిక్స్ ప్రతినిధి తేజేశ్వర రెడ్డి, ఎడ్వాన్స్ ఫాస్ట్రాక్ ప్రైయివేట లిమిటెడ్ జగదీశ్వరరావు, వరుణ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్ ఉదయ్ పాల్గొన్నారు.

పూదోట నిర్వహణకు అనుమతివ్వాలని విజ్ఞప్తి


సీనియర్ డీసీఎం పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం ఒకటిలో వీఐపీ లాంజ్‌కు ఎదురుగా ఉన్న పూదోట పునరుద్ధరణకు, స్వచ్ఛభారత్‌కు అనుమతినివ్వాలని కోరుతూ స్పందన చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు వాల్తేరు డివిజన్ రైల్వే సీనియర్ డీసీఎం పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల 13 ప్రజా సంఘాలు, 80 మంది ప్రతినిధులు సంయుక్తంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టడంతో అనూహ్య స్పందన లభించి, అధికారుల ప్రశంసలు అందుకున్నామన్నారు. ఈ క్రమంలో తమ అసోసియేషన్ ద్వారా స్వచ్ఛభారత్‌తో పాటు పూల తోట నిర్వహణ బాధ్యతను చేపట్టేందుకు అవకాశం కల్పించాలని ఫౌండేషన్ ప్రతినిధులు ఈపూరి బుచ్చిరాజు, ఎంఎస్ఎన్ మూర్తి, కంచుమూర్తి ఈశ్వర్ కోరారు.

నైపుణ్య కోర్సులతో ఉపాధి అవకాశాలు


విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: నైపుణ్యం అందించే కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూతో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్ నిర్వహించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు గురువారం ఏయూలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఏయూ అందించే సర్టిఫికెట్‌కు అమితమైన విలువ ఉంటుందన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. భవిష్యత్తులో ఈ కేంద్రంతో సంయుక్తంగా మరిన్ని కోర్సులు నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నాక్‌లో ఏయూ అత్యుత్తమ స్థానం సాధించిందన్నారు. ఏయూ అభివృద్ధిని వివరించారు. ప్రత్యేక అతిథి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఓఎస్డీ ఎ.ఎస్.శెట్టి మాట్లాడుతూ ఈ కోర్సుల నిర్వహణకు ఏయూ అందించిన సహకారాన్ని మరువలేమన్నారు. ఏయూతో కలిసి పనిచేయడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కోర్సులు నిర్వహిస్తామన్నారు.

స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల సమస్యలపై వినతి


ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న నిర్వాసితులు

పెదగంట్యాడ: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పని చేస్తున్న నిర్వాసితులను మెడికల్ టెస్ట్ పేరుతో తొలగించేందుకు యాజమాన్యం కుట్ర చేస్తోందని, దీనిని అడ్డుకోవాలని నిర్వాసితులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. నిర్వాసితుల ఐక్య సంఘం, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ పద్ధతిపై నిర్వాసితులు స్టీల్ ప్లాంట్‌లో పని చేస్తున్నారని, అటువంటి వారికి శాశ్వత ఉపాధి కల్పించకుండా ఉద్యోగాల నుంచి తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నించడం సరికాదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో పితాని భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, ధర్మాల రామారెడ్డి, డీఎస్‌వీ నర్సింగరావు, రాజేష్, ఎస్‌టీఎం డీపీ మహిళలు పాల్గొన్నారు.

ప్యాకేజీల పేరుతో కుట్ర

- యాజమాన్యంతో కలిసి కేంద్రప్రభుత్వం కుయుక్తులు
- ఉక్కు సిటూ నాయకుడు ఎన్.రామారావు
- 1351వ రోజుకు రిలే దీక్షలు


మాట్లాడుతున్న రామారావు

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా చేపడుతున్న ఉద్యమాలను నీరుగార్చేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో కలిపి కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీల పేరుతో కుట్రలు చేస్తోందని విశాఖ ఉక్కు సిటూ నాయకుడు ఎన్.రామారావు ఆరోపించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 1351వ రోజు, గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సహకారంతో ఉద్యమం సాగుతుందని, ఈ ఉద్యమానికి ప్రజల, ఉద్యోగులను దూరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. ప్రజల దృష్టి మరల్చి ప్రభుత్వ పెద్దల తాబేదారులకు ఉక్కును తాకట్టు పెట్టడానికి విశ్వప్రయత్నాలు సాగిస్తోందన్నారు.

28న మహాధర్నా

ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి ఈ నెల 28వ తేదీన మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, మద్దతుదారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వీఆర్ఎస్ పేరుతో చేస్తున్న ప్రచారం, గందరగోళానికి వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. కార్యక్రమంలో సిటూ నాయకులు గంగాధర్, మొహిద్దీన్, శ్రీనివాస్, బాల శౌరి, కేఆర్‌కే రాజు, మురళి, రామచంద్రమూర్తి, డీసీహెచ్ వెంకటేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మిక సంఘాల ధర్నాను విజయవంతం చేయాలి


ధర్నా గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు ఈనెల 28న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు. గురువారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద ధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉక్కు కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందన్నారు. దానికి తోడు ఉక్కు యాజమాన్యం రోజుకొక కోత విధించడం ద్వారా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు.

గతంలో అనేక సదుపాయాలకు కోత విధించగా ఇటీవల హెచ్‌ఆర్ఏను తొలగించడం ద్వారా భారీగా నష్టం కలిగించిందన్నారు. ఈ అంశంపై ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.ఎస్.ఎన్.రావు, జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, నరేషకుమార్, కారు రమణ, జి. గణపతిరెడ్డి, రమణమూర్తి, వరసాల శ్రీనివాస్, మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి


ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: అగనంపూడి నిర్వాసిత కాలనీల్లో విద్యుత్ వెతలు తీర్చేందుకు ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఏపీఈపీడీసీఎల్ సూపరెంటెండెంట్ ఇంజినీర్ శ్యామ్‌బాబుకు స్థానిక నాయకులు వినతిపత్రం అందించారు. నిర్వాసిత కాలనీల్లో లో ఓల్టేజీ సమస్య తలెత్తుతోందని, విద్యుత్ వాడకానికి సరిపడా సరఫరా చేయడానికి వీలుపడడం లేదని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందివ్వడంతో ఆయన ఎస్ఈకి లేఖ రాశారని, ఈమేరకు వాటిని అందించామని నాయకులు బి.సత్యనారాయణ, చందు రమేష్, ఆశాలత పేర్కొన్నారు. అగనంపూడి జూనియర్ కళాశాల వద్ద ఇండోర్ సబ్‌స్టేషన్, మంగళపాలెంల్లో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ జనాభాకు సరిపడా విద్యుత్ సరఫరా జరగడం లేదని, దీంతో తరచూ సమస్య తలెత్తుతుందని వారు పేర్కొన్నారు.

టూ వీలర్‌పై ప్రమాదకరంగా..



యువత అన్ని రంగాల్లో దూసుకువెళ్లాలంటే.. ఈ విద్యార్థులు మాత్రం ఒక ద్విచక్ర వాహనంపై నలుగురు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాం పేట జూనియర్ కళాశాలలో చదువుతున్న ఈ నలుగురు విద్యార్థులు ఒకే ద్విచక్ర వాహనంపై ప్రతి రోజూ ప్రయాణిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో పాటు అతి వేగంగా వాహనాన్ని నడుపుతున్నారు. వీరిని చూసి స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రయాణంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు.

–పెదగంట్యాడ

ఒంటరిగా వెళ్తున్న మహిళలే లక్ష్యంగా..

చోరీలకు పాల్పడుతున్న యువకుల అరెస్టు


సూర్యనారాయణ


కోదండరావు

అగనంపూడి: ఒంటరిగా నడిచివెళ్తున్న మహిళల వద్ద హ్యాండ్ బాగ్‌లు, నగదు, బంగారం ఆభరణాలు దోచుకుంటున్న ఇద్దరు నిందితులను దువ్వాడ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదగంట్యాడ మండలం, గంగవరానికి చెందిన గేదెల సూర్యనారాయణ, పరవాడ మండలం, ముత్యాలమ్మపాలెంకు చెందిన కొవిరి కోదండరావులు ఒంటరిగా రాత్రి వేళల్లో ప్రయాణం చేసే మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి వద్ద ఉన్న హ్యాండ్ బ్యాగ్‌లను దొంగిలిస్తున్నారు. ఫార్మా కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న అగనంపూడికి చెందిన ఓ మహిళ ఈనెల 16వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు విధులు ముగించుకొని కంపెనీ బస్ దిగి ఇంటికి నడిచి వెళ్తుండగా వెనుకనుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె చేతిలోని బ్యాగ్‌ను లాక్కొనిపోయారు. బ్యాగ్‌లో ఐ ఫోన్‌తో పాటు కంపెనీ గుర్తింపు కార్డు ఉండడంతో ఆమె దువ్వాడ పోలీసులను ఆశ్రయించారు. సీసీ ఫుటేజీలు, సాంకేతికను వినియోగించుకొని వడ్లపూడి బస్టాప్ వద్ద సంచరిస్తున్న ఇద్దరు నిందితుల్ని గురువారం అరెస్టు చేశారు. వీరి చోరీ సొత్తు, బైక్ స్వాధీనం చేసుకున్నారు.